# క్షణికం

అవధానుల విజయలక్ష్మి

**ఆమె** ఏడుస్తోంది...

మిన్నూ మన్నూ ఏకం చేస్తూ భోరున వర్షం కురుస్తున్నట్లు...

పిచ్చిగా పొంగిన సముద్రం ఊరూవాడా ముంచేస్తున్నట్లు...

కళ్ళనుండి నీళ్ళు ధారగా కారిపోతున్నాయి.

గుండెలో పుట్టి వికృతంగా నాలుకలు చాచి ఆకాశాని కెగ సే బడబాగ్నిలాంటి దుఃఖాన్ని చిన్న కన్నుల్లోంచి కారే నీటితో ఆర్పేయాలని చూస్తోం దామె.

కన్నీటితో దుఃఖం ఉద్ధృత మవుతోంది. దుఃఖంతో కన్నీరు ఉద్ధృత మవుతోంది!

ప్రపంచాన్నే ముంచేస్తున్న వరదలోనే బడబాగ్ని పుడితే ఎవ రార్పగలరు దాన్ని?

ఏవీ? 'అమ్మా, ఆకలేస్తోంది-అన్నం పెట్టమా' అని జాలిగా అడిగే ఆ లేత పెదవు లేవీ?

'నా కీ బొమ్మ నచ్చలేదు ఫో' అని అలకతో నేలమీద టపటపా కొట్టుకొనే ఆ చిన్నారి కాళ్ళేవీ?

ఉదయిస్తున్న సూర్యుణ్ణీ, విచ్చుకొన్న గులాబీ పువ్వునీ ఆశ్చర్యంగా చూ సే ఆ చక్రాల్లాంటి కళ్ళేవీ?

ఎక్కడికి పోయా యవన్నీ?

గుండె కొట్టుకోడమనే చర్య ఒక్కక్షణం ఆగిపోయేసరికి...ఊపిరి పీల్చడమనే క్రియ ఒక్క క్షణం మానేసరికి ఆ చైతన్యమంతా శాశ్వతంగా ఆగిపోయిందా?

అందాల స్కూలు డ్రెస్సులో బడికెళ్ళడం...ఫస్టు రాంకులు తెచ్చుకోవడం...డాక్టరు చదవడం...చక్కని కోడల్ని తేవడం...దేశమంతటికీ పేరు తెచ్చుకోవడం...తన కలల జీవితకాల మింత స్వల్పమా?

కాబోయే ఆ డాక్టరు...దేశాన్ని ఉద్ధరించే ఆ రేపటి మనిషి...అయిదేళ్ళు నిండకుండానే ఈ భూమిలో కలిసిపోయాడా? ప్రపంచంలో సర్వ చైతన్యానికి ఆఖరి రూపం ఆ మట్టేనా?

ప్రశ్నలు...ప్రశ్నలు...ప్రశ్నలు...

ఆమె ఎవరినీ అడగటం లే దా ప్రశ్నలు.

గుండె లోతుల్లోంచి వస్తున్న ఆ ప్రశ్నలు బయట పడకుండానే దుఃఖంలో కరిగిపోతున్నాయి.

×× ×× ××

మోకాళ్ళలో తల దూర్చి కూర్చున్నా డతను.

అతని కళ్ళు నేలవైపే దీక్షగా చూస్తున్నాయి.

తన చుట్టూ ఓ చరాచర ప్రపంచం ఉందనీ...అందులో చాలామంది మనుష్య లున్నారనీ...వాళ్ళంతా ఏమేమో మాట్లాడుకొంటున్నారనీ...ఎందుకో ఏడుస్తున్నారనీ...మరెందుకో ఒకరినొకరు ఓదార్చుకొంటున్నారనీ...తెలియనట్లు నిర్లిప్తంగా, నిశ్చలంగా కూర్చొని ఉన్నాడతను!

"లే, నాయనా. అలా కూర్చోకు! అవతల నీ భార్య గుండె చెరువయ్యేటట్లు ఏడుస్తోంది. మేమెవరం పట్టలేక పోతున్నాం. లే! లేచి ఆమె క్కాస్త ఓదార్పు నియ్యి." ఎవరో అన్నారు అతని భుజంమీద చెయ్యి వేసి.

"అలా వెర్రిగా చూస్తూ ఉండిపోకు, బాబూ! కనీసం ఏడ్చి అయినా గుండెలో దుఃఖాన్ని తగ్గించుకో! ఇలాగైతే పిచ్చెక్కిపోతావు." ఇంకెవరో అన్నారు.

అతను నెమ్మదిగా తలెత్తి వాళ్ళవైపు చూశాడు.

చిరునవ్వు నవ్వాడు...

విశాల విశ్వంలో అనంతకోటి నక్షత్రాలు ఆకాశంలోకి మంట లెగజిమ్ముకొంటూ తమ చుట్టూ తామే గిర్రున తిరుగుతుంటే, వాటిలో లక్షోవంతు కూడా లేని గ్రహాలు వాటి చుట్టూ గిరగిరా తిరుగుతుంటే అటువంటి కోట్ల గ్రహాల్లో ఒకటైన భూమ్మీద...కోటోవంతు కూడా లేని మనిషి...మరు నిమిషం ఏమయిపోతుందో కూడా తెలియని తన జీవితం గురించి తపన పడిపోతుంటే ఆకాశంలోంచి చూసి దేవుడు ఫక్కున నవ్వినట్లు...

పళ్ళెంలో నీటిలో కనపడే చందమామ నీడని చూపించి పసివాడు "అమ్మా, ఆ చందమామని నేను తీసుకుంటానే" అంటే ఆ తల్లి పసివాణ్ణి చూసి జాలిగా నవ్వినట్లు...

ఆ నవ్వు చూసి కొందరు భయపడ్డారు.

కొందరు జాలిపడ్డారు.

కొందరు అసహ్యపడ్డారు.

అతను నెమ్మదిగా లేచి భార్యవైపు నడిచాడు.

ఆమె ఇంకా ఏడుస్తూనే ఉంది...పొర్లి పొర్లి ...వెక్కి వెక్కి.

ఆమె పక్కనే కూర్చొన్న అతని చేతులు ఆమె తలను నిమురుతున్నాయి...సున్నితంగా.

వరదలో కొట్టుకుపోతున్నవాడికి ఏదో గడ్డిపోచ దొరికినట్లు...ఆత్రంగా...ఆబగా...తల నిమిరే ఆ చేతిని ఆమె తన చేతిలోకి తీసుకొంది.

"ఏమండీ...ఇంక లేడండీ...మన బాబు ఇక లేడండీ! ఈ ప్రపంచంలోనే లేడండీ...ఎక్కడి కెళ్ళిపోయాడండీ మన బాబు? చెప్పండీ."

ఆమె ఆర్తిగా అడుగుతోంది.

అతను జవాబు చెప్పలేదు. చేయి మాత్రం ఆమె తలను నిమురుతూనే ఉంది.

ఆమె హఠాత్తుగా మాటలూ, ఏడుపూ ఆపేసి అతనివైపు ఎర్రబడ్డ కళ్ళతో తీక్ష్ణంగా చూసింది.

"కొడుకుపోతే మీకు కళ్ళంట నీళ్ళుకూడా రాడం లేదేమండీ? ఇన్నాళ్ళూ మీరు వాడిమీద చూపించిన ప్రేమంతా ఉత్తదేనా? వాడి పెంపకంలో చూపించిన శ్రద్ధంతా ఉత్తదేనా? ఏదో మీ కర్తవ్యం మీరు నెరవేర్చేశారు. మీకు వాడిమీద ప్రేమే లేదు. లేకపోతే అలా బండలా కూర్చోరు...అవునా?"

అతను జవాబు చెప్పలేదు.

"చెప్పండి...మీ కంట నీ రెందుకు లేదో చెప్పండి." ఆమె అతని చొక్కా పట్టుకొని తీవ్రంగా అడిగింది. ఆమె హృదయంలోని దుఃఖం ఆవేశంగా మారింది.

అతను మృదువుగా ఆమె చేతిని విడిపించుకొన్నాడు.

"చెప్పమంటావా, నా కంట నీరెందుకు రాలేదో?" అడిగా డతను.

"చెప్పండి."

"నాకు మరో కుటుంబ ముంది." నిశ్చలంగా చెప్పాడతను.

ఉరుకులు పరుగులు పెడుతున్న వరదకు ఆనకట్ట పడినట్లు ఆమె ఆవేశం చప్పున చల్లారిపోయింది.

"మరో కుటుంబమా? అంటే ఇంకో భార్య?"

"అవును. ఇంకో భార్యా, పిల్లలూ!"

"భార్యా, పిల్లలూ కూడానా?"

"అవును...అయిదుగురు పిల్లలు! దేవతా మూర్తులంత అందమైన పిల్లలు! బృహస్పతంత తెలివితేట లున్న పిల్లలు! వాళ్ళ తల్లి

గంధర్వ కన్యలంత అందమైనది! అందం, అనురాగం, కరుణ, మేధస్సు, స్త్రీత్వం...అన్నీ కలబోసిన అపూర్వమైన స్త్రీ! ఆమె మట్లాడితేనే వీణతంత్రులు శ్రుతి చేసినంత మధురంగా ఉంటుంది. ఇంక ఆమె పాడితే గంధర్వులే దిగివచ్చి తన్మయంగా ఆ పాటని వింటారు!"




వింటున్న ఆమె కళ్ళు ఈర్ష్యతో భగ్గుమన్నాయి.

"మరి ఇన్నాళ్ళూ వీళ్ళ గురించి నాకు చెప్పలేదేం?" క్రోధంగా అడిగింది.

"అవును...చెప్పలేదు! చక్రంలో ఇరుసులా గిర్రున తిరిగే ఈ యాంత్రిక జీవితంనుండి ...ఈర్ష్య, ద్వేషం, వగ...వీటన్నిటితో నిండి ఉన్న ఈ ప్రపంచం నుండి తాత్కాలికంగా పారిపోవాలనుకొన్నప్పుడల్లా ఆ ఇంటికి పరిగెత్తేవాడిని...అలా తాత్కాలికంగా పారిపోవాలనుకోవడం నా తప్పా?"

"అంత బాగుంటుందా ఆ ఇల్లు?" ఆమె ఆవేదన ఆక్రోశంగా మారింది.

"బాగుండడమా! చాలా చిన్నమాట ఉపయోగిస్తున్నావ్. రాజభవనాల్లో కూడా దొరకనంత సౌఖ్యం ఆ ఇంట్లో దొరుకుతుంది. ఋష్యాశ్రమంలో కూడా దొరకనంత ప్రశాంతత ఆ ఇంట్లో దొరుకుతుంది! కోట్లు ఖర్చు పెట్టినా అటువంటి ఇల్లు దొరకదు!"

అతను చెప్పిన వార్త కలిగించిన దిగ్భ్రమతో నిశ్చేష్టురాలై కూర్చొన్న ఆమె హఠాత్తుగా విరుచుకుపడింది.

"మీ రుత్త మొనగాళ్ళు! మీలో ఉన్నదంతా కుళ్ళూ కుతంత్రమే! ఛీ ఛీ! మీరింత మోసం చేస్తారనుకోలేదు!"

"మోసం చేశానా? నీ గుండెమీద చెయ్యేసుకొని చెప్పు. నే నిన్నాళ్ళూ మన కుటుంబం మీద చూపించిన ప్రేమంతా ఉత్తదేనా? ఎన్నిసార్లు నీ నోటితో నువ్వన్నావు 'మీరు భర్తగా దొరకడం నా అదృష్ట'మని! ఇప్పుడు నేను చెప్పిన ఈ విషయంతో ఆ నిజమంతా అబద్ధమయిపోయిందా?"

జవాబు చెప్పలేనట్లు నిస్సహాయంగా చూసిందామె. ఆ తర్వాత వణికే గొంతుతో అంది—

"పదండి...ఇంద్రభవనం లాంటి ఇంటినీ, గంధర్వ కన్యలాంటి ఆ ఇల్లాల్నీ, బృహస్పతుల్లాంటి ఆ పిల్లల్నీ నేనూ చూస్తాను. చూసి

నా గుండెమంట చల్లార్చుకొంటాను."

లేవబోతున్న ఆమె చేయి పట్టుకొని మృదువుగా కూర్చోపెట్టా డతను.

"కూర్చో...ను వ్వివ్వు డా ఇంటిని చూడలేవు." ఆవేదనా భరితంగా నవ్వుతూ అన్నా డతను.

"చూడలేనా? ఎందుకూ?"

"ఎందుకంటే...ఎందుకంటే ఆ భవనం అలా నా కళ్ళముందే కూలిపోయింది. ఒక్క ఇటుక కూడా మిగలనంతగా నాశనమైపోయింది...కాలగర్భంలో కరిగి...కలి సిపోయింది."


"ఆ! అంత ఇల్లూ నాశనమైపోయిందా? మరి...మరి ఆమె?"

"ఆమె...ఆమెకూడాను! లావణ్యం తొణికిసలాడే ఆ శరీరం ఇక లేదు. చిరునవ్వు చిందించే ఆ పెదవులూ లేవు. అనంత విశ్వంలోకి నేను చూస్తుండగానే ఎగిరిపోయింది!"

ఆమె మనస్సులో ఈర్ష్య ఆవేదనగా మారింది. ఆవేదన జాలిగా మారింది.

"మరి ఆ తల్లిలేని ప సివాళ్ళు అయిదుగురూ ఎలా బతుకుతున్నారండీ?"

"చాలా హాయిగా దేవుడి ముంగిట్లో ఆడుకొంటున్నారు!"



"అంటే?"

"అంటే...ఒక్కొక్కరినే...ఒక్కొక్కరినే దేవుడు నాకు దూరం చే సేశాడు...ఆ అయిదు చందమామ తునకల్లో...ఆ అయిదు ధ్రువనక్షత్రాల్లో...ఒక్కటంటే ఒక్కటి నాకు మిగల్లేదు."

"భగవాన్!" అంతవరకూ దుఃఖానికి కట్టిన ఆనకట్ట మళ్ళా తెగిపోయింది! ఆమె కన్నీరు వరదైంది.

"ఏడవకు...వింటున్న నీకే ఇంత దుఃఖంగా ఉంది! అన్నీ అనుభవించిన నేను ఒక్క కన్నీటి చుక్కయినా రాల్చలేదప్పుడు! కొడుకు పోయినందుకు కంట తడైనా పెట్టలేదని నింద వేశావ్! అన్ని సంపదల్నీ...అంత మంచి కుటుంబాన్నీ పోగొట్టుకున్నప్పుడే కంట తడి పెట్టలేదు. ఇప్పుడు ఎలా పెట్టాను! నువ్వే చెప్పు! కొండంత ఆ దుఃఖంముందు ఈ దుఃఖం ఎంత చిన్నదో నువ్వే చెప్పు."

కన్నీటి వరదకి చేత్తో ఆనకట్ట వేయడానికి ప్రయత్నిస్తూ, ఆమె దుఃఖంలో ఆశ్చర్యాన్ని మేళవించి అడిగింది.

"నాకు తెలియకుండా అంత అందమైన ఆమెనూ, అయిదుగురు పిల్లల్నీ ఎలా ఉంచగల్గేరండీ?"

"ఎలా ఉంచగలిగానా? వాళ్ళు నాకు మాత్రమే కనపడే ఛాయా రూపాలు మాత్రమే కాబట్టి..."

"అంటే?"

"అంటే...ముచ్చటైన ఆ కుటుంబం...స్వర్గం లాంటి ఆ ఇల్లూ-అవన్నీ అప్పుడప్పుడు నా కలల్లో కనిపించే దృశ్యాలు మాత్రమే! ఆ కలలింక లేవు. ఎప్పుడో కరిగిపోయాయి. ఈ కల...ఈ కల మాత్రం అయిదేళ్ళు మురిపించి, మురిపించి కరిగిపోయింది. అయిదు క్షణాల ఆ కలలకీ అయిదేళ్ళ ఈ కలకీ తేడా ఏమిటో చెప్పు! ఎప్పటికైనా కరిగిపోవల సిన కల గురించి ఎందు కంత దుఃఖపడడం చెప్పు!"

అతని చేతు లామె తలని నిమురుతూనే ఉన్నాయి! •




**Tourist Services in North India**

మా స్వంత డీలక్స్/సూపర్ డీలక్స్ (Video) బస్సులు ఉత్తర భారత దేశమందలి ముఖ్యమైన చారిత్రాత్మక ప్రాంతములు మరియు పుణ్యక్షేత్రములకు ఢిల్లీ నగరం, తాజ్ మహల్, మధుర, బృందావన్, ముస్సోరి, బదరీనాథ్, కేదార్‌నాథ్, హరిద్వార్, జైపూర్, సిమ్లా, కాశ్మీర్, శ్రీనగర్, గుల్మార్గ్, పహల్‌గామ్, అమృతసర్, భాక్రాడామ్ మరియు చండీఘర్—నిర్ణీత రోజులలో ఢిల్లీ నుండి బయలుదేరును.

**Available 35 Seater Super Delux Video Coaches on Contract for Groups**
**Our receipts are approved for LFC/LTC**

అధునాతన సౌకర్యములతో తెలుగు వారిచే ప్రత్యేకముగా నడుపబడుచున్న భోజన ఫలహారశాల మరియు విశ్రాంతి గృహమైన **హోటల్ సదరన్** ( మా అనుబంధ సంస్థ ) లో వసతి ఢిల్లీలో ఏర్పాటు చేయబడును.

**(40 Rooms With Attached Bath & Toilets, Halls For Groups, Colour T.V., Lift & P.C.O., With Moderate Tariff)**

వివరములకు :

**SOUTHERN TRAVELS (Regd.)**
**Winners of Transworld Gold Medal**
( ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ )
**Arya Samaj Road, Karolbagh,**
**NEW DELHI - 110 005.**
**Phones: 566724/725 & 568728**
**Madras Office Ph: 33493**

SUVARNA